# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో ఏడు నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ రోజు తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తున్నారు. బాపట్లలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి పాల్గొంటారు.**
3. **రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పరిపాలన అందిస్తున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
4. **రాష్ట్రంలో భూములకు సంబంధించిన ప్రతి సమస్యను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**
5. **తెలంగాణాలో గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.**

==========================

దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ విద్యాలయాలను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిన్న జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి వర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో ఏడు నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, చిత్తూరు జిల్లాలోని వలసపల్లె, సత్యసాయి జిల్లాలోని పాలసముద్రం, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాళ్లపల్లె, రొంపిచర్ల, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ, నూజివీడు, నంద్యాల జిల్లాలోని డోన్‌లో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తెలంగాణలోని జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయా విద్యాలయాలను ఏర్పాటు చేయనుంది.

--------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో ఈ రోజు జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు మానవ వనరుల అభివృద్ధి శాఖ

మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వేల 94 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు చేర్చి లోటుపాట్లను చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, ఒక్కొక్క విద్యార్థి ప్రగతి నివేదిక ఆధారంగా వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. సమావేశం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనాలకు అధికారులు ఏర్పాటుచేశారు.

---------------------------

ఆర్థికాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇంధన సామర్థ్య ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్..ఈఈఎస్ఎల్ సహకారంతో 'ఊర్జావీర్' కార్యక్రమాన్ని కృష్ణా జిల్లాలోని పోరంకిలో ఈరోజు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జాతీయ ఇంధన సామర్థ్య గృహోపకరణాల కార్యక్రమం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాలను కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రారంభిస్తారని విజయానంద్ తెలిపారు. ఊర్జావీర్ పథకం కింద ప్రజలకు ఇంధన సామర్థ్య ఉపకరణాలను అందుబాటులోకి తెచ్చేందుకు లక్షా 12 వేల మంది ప్రైవేట్ రిజిస్టర్ ఎలక్ట్రీషియన్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

---------------------------

రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పరిపాలన అందిస్తున్నామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం.. ఎస్‌డీఆర్ఎఫ్‌ను హైదరాబాద్‌లో ఆయన నిన్న ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది సిబ్బందితో ఏర్పాటైన ఎస్‌డీఆర్ఎఫ్.. భారీ అగ్ని ప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు అత్యవసరంగా సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా మార్పు చెందనున్నాయి. ఎస్‌డీఆర్ఎఫ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ఆధునీకరించేందుకు ప్రభుత్వం 35 కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భూములకు సంబంధించిన ప్రతి సమస్యను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులో భూసమస్యలు పరిష్కారం కాకున్నా ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలం పేటేరు గ్రామంలో నిన్న జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ, అధికారులు ప్రజల నుంచి అందిన అర్జీలను వెంటనే పరిశీలించి వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్.....23 సెకన్లు

కాగా... రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 645 రెవెన్యూ గ్రామ సదస్సులకు తొలిరోజు 11 వేల 857 అర్జీలు వచ్చాయని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. వీటిలో 152 అర్జీలపై అక్కడికక్కడే చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు పంచాయతీలు జాతీయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఆరోగ్య పంచాయతీ విభాగంలో చిత్తూరు జిల్లా ఐరాల మండలంలోని బొమ్మసముద్రం ఎంపికైంది. తాగునీటి వసతి సమృద్ధిగా ఉండే పంచాయతీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి, పరిశుభ్రత-పచ్చదనంలో అదే జిల్లా అనకాపల్లి గ్రామీణ మండలంలోని తగరంపూడి, సామాజిక న్యాయం, భద్రత విభాగంలో ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల పంచాయతీ జాతీయ అవార్డులకు ఎంపికయ్యాయి. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారానికి ఎంపికైన ఒక్కో పంచాయతీకి కేంద్రప్రభుత్వం కోటి రూపాయల చొప్పున అందజేయనుంది. ఈ నెల 11వ తేదీన ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచులకు పురస్కారాలు అందజేయనున్నారు. కాగా.. అవార్డులకు ఎంపికైన పంచాయతీలకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ముందుకు కదులుతూ.. పంచాయతీలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయని ఆయన పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణాలో గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కొత్త నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని కొందరు అభ్యర్థులు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని హైకోర్టును కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం నిన్న తీర్పు వెలువరించింది. పిటిషనర్లు మెయిన్స్‌కు ఎంపిక కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది జూన్ నెలకు ముందు అనధికారికంగా నిర్మించిన భవనాలు.. లే ఔట్లపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే విషయంపై త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరులోని వివిధ లేఔట్లను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. భవన నిర్మాణాలను తరచూ పరిశీలిస్తామని.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుంటే కూల్చివేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి.. నిబంధనలను సరళతరం చేశామని మంత్రి నారాయణ వివరిస్తూ...

...వాయిస్ ....30 సెకన్లు

---------------------------

దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సాయుధ దళాల సేవలు ...., త్యాగాలను స్మరించుకునే ఉద్దేశ్యంతో ఈరోజు సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1949 ఆగస్టు 28వ తేదీన రక్షణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏటా డిసెంబర్ 7వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

====================